

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



వడ్డీ మాఫియా!



- ప్రభుత్వ ఉద్యోగులే పెట్టుబడిదారులు!
- పోలీసుల విచారణలో విస్తుపోయే నిజాలు
- ఇప్పటికే 40 అనుమతి లేని ఫైనాన్స్‌లపై కేసులు
- రూ.1.21 కోట్లు, భారీగా బంగారం, వెండి స్వాధీనం
- భూములు, ఇళ్ల రిజిస్ట్రేషన్లతో అప్పులు
- 3 నుంచి 7 శాతం దాకా వడ్డీ వసూలు
- అప్రమత్తమవుతున్న అక్రమ ఫైనాన్స్‌ల నిర్వాహకులు

ఆంధ్రజ్యోతి ప్రతినిధి, సిద్దిపేట, ఏప్రిల్ 15: 'సిద్దిపేటకు చెందిన శ్రీనివాస్‌కు అత్యవసరంగా లక్ష రూపాయలు కావాల్సి వచ్చింది. ఒక మిత్రుడి సలహాతో ఫైనాన్స్ నిర్వాహకుడిని కలిశాడు. ఇద్దరి పూచీకత్తు సంతకాలు, బ్లాంక్ చెక్కులు సమర్పిస్తే రూ.లక్ష ఇస్తానని అంగీకరించాడు. వడ్డీ మాత్రం 5 శాతం అని కండీషన్ పెట్టాడు. నెలకు సంబంధించిన వడ్డీ రూ.5వేలతోపాటు పేపర్ ఛార్జీలు రూ.వెయ్యి ముందే కట్ చేసుకుని రూ.94వేలు ఇచ్చాడు.'



'హుస్నాబాద్‌లో నివాసముంటున్న ఓ వ్యక్తికి తన కూతురి పెళ్లి కోసం రూ.10లక్షల అవసరం ఉండగా రూ.25 లక్షల విలువైన ఇంటి స్థలాన్ని ఓ ఫైనాన్స్ సంస్థ నిర్వాహకుడి పేరిట రిజిస్ట్రేషన్ చేశాడు. రూ.10లక్షలకు 3శాతం చొప్పున ప్రతీనెలా వడ్డీ ఇవ్వాలని, లేకుంటే స్థలం తనకే చెందుతుందని సదరు నిర్వాహకుడు నిబంధన పెట్టాడు. విలువైన స్థలాన్ని తక్కువ ధరకు విక్రయించడం కంటే తనఖా కింద రిజిస్ట్రేషన్ చేసి నెమ్మదిగా అప్పు తీర్చవచ్చని ఆ వ్యక్తి ఒప్పుకున్నాడు. ప్రతీనెల రూ.30వేల వడ్డీ చెల్లించడానికి ఇంకా అప్పులు చేయాల్సిన పరిస్థితిలో కొట్టుమిట్టాడుతున్నాడు.'

జిల్లాలో అక్రమంగా నడుస్తున్న వడ్డీ వ్యాపార దందాలకు పై సంఘటనలు అద్దం పడుతున్నాయి. బహిరంగ మార్కెట్‌లో నగదుకు ఇబ్బందులు ఎదురవుతున్న దృష్ట్యా ఫైనాన్స్ నిర్వాహకులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. డబ్బు అవసరం ఉన్నవారి నడ్డి విరిచేలా వడ్డీ మీద వడ్డీ వసూలు చేస్తున్నారు. తాజాగా ఏకకాలంలో జిల్లా వ్యాప్తంగా చేసిన దాడుల్లో అనేక వాస్తవాలు వెలుగులోకి రావడమే ఇందుకు నిదర్శనం.

తెరవెనుక ప్రభుత్వ ఉద్యోగులు..

కొందరు ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు నెలవారీ చిట్టీలను నిర్వహించడం బహిరంగ రహస్యమే. కొంతమంది రియల్ ఎస్టేట్ రంగంలోనూ పేరుగాంచారు. ఇంకొందరు ఉద్యోగులైతే తమ ప్రభుత్వ కొలువులను సైతం పక్కనబెట్టి రియల్ దందాతో పాటు ఫైనాన్స్ వ్యాపారాల్లోనూ మునిగి తేలుతున్నారు. రూ.లక్షల్లో వేతనాలతో పాటు ప్రభుత్వ ఉద్యోగి అనే నమ్మకాన్ని ప్రజల్లో రంగరించడమే వీరికి ప్రధాన పెట్టుబడి. అందుకే ఇతర వ్యాపారస్తుల కంటే ప్రభుత్వ ఉద్యోగుల ద్వారా వచ్చిన ఆఫర్లకే క్రయవిక్రయదారులు మొగ్గు చూపిస్తుంటారు. భూదందాలకు అన్ని సమయాల్లోనూ నగదు అందుబాటులో ఉండాలి. అందుకే ఫైనాన్స్ సంస్థల్లోనూ స్లీపింగ్ పార్ట్‌నర్‌లుగా వ్యవహరిస్తున్నారు. ఇటీవల పోలీసులు స్వాధీనం చేసుకున్న పలు రికార్డుల్లో ప్రభుత్వ ఉద్యోగుల పాత్ర ఉన్నట్లుగా పోలీసులు గుర్తించినట్లు సమాచారం. ఇందులో ఉపాధ్యాయులే ఎక్కువ మంది ఉన్నట్లుగా ప్రచారం జరుగుతున్నది. గతంలోనూ ఉపాధ్యాయుల దందాలపై అనేక ఫిర్యాదులు వెల్లువెత్తాయి. అయితే బహిరంగంగా ఇతర వ్యక్తులు ఉండగా, తెరవెనుక మాత్రం ప్రభుత్వ ఉద్యోగులే క్రియాశీలకంగా ఉంటూ ఫైనాన్స్ సంస్థలకు దిశానిర్దేశం చేస్తున్నట్లుగా తేటతెల్లమవుతున్నది. కొందరి పేర్లపై విచారణ కూడా చేస్తున్నట్లు విశ్వసనీయంగా తెలిసింది.

రాత్రికిరాత్రే అప్రమత్తం

గత శనివారం జిల్లా వ్యాప్తంగా అక్రమ ఫైనాన్స్‌లపై పోలీసులు మెరుపు దాడికి దిగారు. ఆదివారం కూడా తమకున్న సమాచారం ప్రకారం మరికొన్ని చోట్లకు వెళ్లారు. అయితే శనివారం రాత్రికిరాత్రే చాలామంది నిర్వాహకులు అప్రమత్తమైనట్లుగా తెలుస్తోంది. తమ రికార్డులు, పెట్టుబడిదారుల వివరాలను పోలీసుల కంటబడకుండా దారి మళ్లించినట్లుగా తెలిసింది. సిద్దిపేటలోనే సుమారు 100కు పైగా అక్రమ ఫైనాన్స్ కేంద్రాలు ఉన్నట్లుగా సమాచారం. జిల్లా మొత్తంగా 40 కేంద్రాల్లో ఈ దాడులు జరిగాయి. రూ.121 కోట్లకు పైగా అక్రమంగా ఉన్న నగదుతోపాటు 13 కిలోల వెండి, 70తులాల బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. దాదాపు 500 డాక్యుమెంట్లను సీజ్ చేశారు. ఇక మరుసటి రోజు పక్కా సమాచారంతో తనిఖీలు చేసినప్పటికీ ఖాళీ కుర్చీలు, ఖాళీ బీరువాలు మినహా డాక్యుమెంట్లు కూడా లభించలేదు. అయితే పకడ్బందీగా 24 బృందాలతో పోలీసుశాఖ ఈ దాడులకు పాల్పడిన విషయం బయటకు పొక్కడంతో మిగితావారంతా సర్దుకున్నారు. కొన్ని డాక్యుమెంట్లలో 7 నుంచి 10 శాతం కూడా వడ్డీ వసూలు చేసిన దాఖలాలు ఉన్నట్లుగా తెలుస్తున్నది. పెద్ద సంఖ్యలో ప్రామిసరీ నోట్లు, బాండ్ పేపర్లు, బ్లాంక్ చెక్కులు, తెల్ల కాగితాలపై సంతకాలు, ఆస్థి పత్రాలన్నీ ప్రస్తుతం పోలీసుల చేతికి చిక్కాయి.

ఫిర్యాదులు చేయండి

ఫైనాన్స్ కేంద్రాల ద్వారా మోసపోయిన బాధితులు ఫిర్యాదు చేయాలని పోలీసు యంత్రాంగం సూచించింది. అంతేకాకుండా ఎవరైనా అక్రమంగా వడ్డీ వ్యాపారాలు నిర్వహించినా కూడా వారి గురించి సమాచారం అందించాలని పోలీసులు కోరుతున్నారు. మనీ లెండింగ్ లైసెన్సులు లేకుండానే వడ్డీ దందాలు చేయడం అక్రమమని పోలీస్ కమిషనర్ అనురాధ పలుమార్లు హెచ్చరించారు. ఫిర్యాదులు వచ్చినా కొద్దీ చర్యలకు ఉపక్రమిస్తామని ఆమె చెప్పకనే చెబుతున్నారు. అక్రమ ఫైనాన్స్ కేంద్రాల గురించి సమాచారం అందించిన వారి పేర్లు గోప్యంగా ఉంచుతామని భరోసా కల్పిస్తున్నారు. డయల్ 100 నంబరుతో పాటు సిద్దిపేట పోలీస్ కమిషనరేట్ కంట్రోల్ రూం నంబరు 8712667100కు కాల్ చేయాలని సూచనలు చేశారు.



వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సీపీ అనురాధ

గంజాయిరహిత జిల్లాగా తీర్చిదిద్దుదాం

- సిద్దిపేట పోలీస్ కమిషనర్ అనురాధ

సిద్దిపేట క్రైం, ఏప్రిల్ 15 : సిద్దిపేటను గంజాయిరహిత జిల్లాగా తీర్చిదిద్దుదామని సీపీ డాక్టర్ అనురాధ అన్నారు. తెలంగాణ రాష్ట్ర యాంటినార్కోటిక్స్ బ్యూరో రూపొందించిన వాల్‌పోస్టర్‌ను సిద్దిపేట పోలీస్ కమిషనరేట్‌లో సీపీ ఆవిష్కరించి మాట్లాడారు. గంజాయి, డ్రగ్స్, ఇతర మత్తుపదార్థాలను ఉక్కుపాదంతో అణిచివేస్తామని ఆమె స్పష్టం చేశారు. గంజాయి, డ్రగ్స్ ఇతర మత్తుపదార్థాల కేసుల్లో ఉన్న నిందితులపై, వారి కదలికలపై నిఘా పటిష్ఠం చేసినట్లు చెప్పారు. మాదకద్రవ్యాలను అరికట్టడంలో ప్రజల భాగస్వామ్యం చాలా కీలకమన్నారు. డ్రగ్స్‌ను అరికట్టేందుకు రాష్ట్ర యాంటీ నార్కోటిక్స్ బ్యూరో(టీఎస్ నాబ్) తీవ్రంగా శ్రమిస్తుందన్నారు. గంజాయి, డ్రగ్స్, కల్తీకల్లు, ఆల్ప్రాజోలం, డైజోఫార్మాకు సంబంధించిన ఏదైనా సమాచారం ఉంటే ప్రజలు స్టేట్ టోల్ ఫ్రీ నంబర్ 8712671111, సిద్దిపేట పోలీస్ కంట్రోల్ రూమ్ 8712667100, డయల్ 100 నంబర్లకు సమాచారం అందించాలని సూచించారు. సమాచారం అందించిన వారి పేర్లను, వివరాలను గోప్యంగా ఉంచుతామన్నారు. కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ మల్లారెడ్డి, సిద్దిపేట ఏసీపీ మధు, టాస్క్‌ఫోర్స్ ఏసీపీ రవీందర్, సీసీఆర్బీ ఇన్‌స్పెక్టర్ గురుస్వామి, ఎస్బీ ఇన్‌స్పెక్టర్ కిరణ్, శ్రీధర్, కమ్యూనికేషన్ ఇన్‌స్పెక్టర్ కమలాకర్, టూటౌన్ ఇన్‌స్పెక్టర్ ఉపేందర్, ఐటీసెల్ ఎస్‌ఐ నరేందర్‌రెడ్డి సీసీ ఆర్బీ హెడ్‌కానిస్టేబుల్ భాగ్య, తదితరులు పాల్గొన్నారు.

'తపాస్‌పల్లి'ని సందర్శించిన అధికారులు

- మిషన్ భగీరథ నీరు పొలాలకు మళ్లింపుపై విచారణ
- పశువుల కోసం వాల్వ్ ఓపెన్ చేశామన్న రైతులు
- వాటర్‌మన్‌ను మందలించిన అధికారులు
- మరోసారి అలా చేస్తే చర్యలు తప్పవని హెచ్చరిక

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



ఎయిర్‌వాల్వ్ వద్ద విచారణ చేపడుతున్న మిషన్ భగీరథ ఈఈ శ్రీనివాస్, అధికారులు

చేర్యాల, ఏప్రిల్ 15 : "మిషన్‌భగీరథ నీరు పొలాలకు మళ్లింపు" శీర్షికన ఆంధ్రజ్యోతిలో సోమవారం ప్రచురితమైన కథనానికి మిషన్‌భగీరథ ఉన్నతాధికారులతో పాటు జిల్లా అధికారులు స్పందించారు. వాటర్ గ్రిడ్ ఈఈ శ్రీనివాస్, సిద్దిపేట జిల్లా ఎస్‌ఈ శ్రీనివాస్‌చారి, డీపీవో దేవకీదేవీ, డీఈ అనిల్, గ్రామ ప్రత్యేకాధికారి లక్ష్మీనారాయణ తదితరులు కొమురవెల్లి మండలం తపాస్‌పల్లి గ్రామాన్ని సందర్శించారు. గ్రామశివారులోని ఎయిర్‌వాల్వ్ ప్రదేశంలో పైపులు లీకవుతుండడాన్ని గమనించి వాటర్‌మెన్ సిద్దులు, చుట్టుపక్కల రైతులను విచారించారు. నీటిసరఫరా తదితర విషయాలపై స్థానికులను ఆరా తీశారు. పశువుల కోసం రాత్రివేళ ఎయిర్‌వాల్వ్ ఓపెన్ చేశామంటూ అసంబద్ధ సమాధానం చెప్పడాన్ని గుర్తించారు. నిబంధనలకు విరుద్ధంగా ఎయిర్‌వాల్వ్‌ను లీక్ చేస్తే చట్టపర చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరించారు. అయితే, మరోసారి పొరపాటు చేయబోమని, మొదటితప్పుగా మన్నించాలని ప్రాథేయపడుతూ లిఖితపూర్వక పత్రాన్ని అధికారులకు అందించారు. గ్రామంలో నీటి సమస్య ఉత్పన్నం కాకుండా సక్రమంగా విధులు నిర్వర్తించాలని, లేదంటే విధుల నుంచి తొలగిస్తామని వాటర్‌మెన్ సిద్దులును మందలించారు. అనంతరం గ్రామంలోని జీఎల్‌బీఆర్ ద్వారా కొనసాగుతున్న నీటి సరఫరాను పరిశీలించారు. తాగునీటి సమస్య పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలను సిబ్బందికి తెలిపారు. గ్రామపంచాయతీ కార్యాలయాన్ని పరిశీలించి రికార్డులలో నమోదు చేశారు.



సేకరించిన చింతపండు

ధర లేక 'చింత'

- మార్కెట్‌లో డిమాండ్ లేక దిగాలు
- ఈ ఏడాది సగానికిపైగా తగ్గిన ధర
- గతేడాది క్వింటాలు రూ. 21వేలు
- ఈ ఏడాది రూ.6వేల నుంచి రూ. 10 వేలు





దుబ్బాక, ఏప్రిల్ 15: చింతపండుకు ఈ ఏడాది గిట్టుబాటు ధర దక్కడం లేదు. గతేడాది మంచి ధర పలకగా.. ఈ సారి ధరలేక రైతులు, వ్యాపారులు ఆందోళన చెందుతున్నారు. సిద్దిపేట జిల్లాలోని గ్రామాల్లో చింత పండు సేకరణ ఓ ఉపాధిగా భావిస్తారు. వేలాది క్వింటాళ్లను సేకరించి, మార్కెట్‌కు తరలిస్తారు. జిల్లాలోని దుబ్బాక, మిరుదొడ్డి, దౌల్తాబాద్, రాయపోల్, తొగుట, చిన్నకోడూరు, మల్యాలతో పాటు పలు మండలాల్లోని గ్రామాల నుంచి చింతపండును సేకరించి, హైదరాబాద్‌లోని మలక్‌పేట మార్కెట్‌కు తరలిస్తారు. అక్కడ చింతపండు నాణ్యతను పరిశీలించి వేలం ద్వారా ధర నిర్ణయిస్తారు. అయితే, మార్కెట్‌లో ధర లేకపోవడంతో వ్యాపారులకు చింతపండు ఈ ఏడాది నష్టాన్నే మిగులుస్తోంది. గ్రామాల్లో చింత చెట్టు ఒక్క దానిని రైతుల నుంచి ముందుగానే మారు బేరగాళ్లు రూ. 7వేల నుంచి రూ. 20 వేలకు గుత్తకు తీసుకుంటారు. ఒక్కో చెట్టుకు క్వింటా నుంచి మూడు క్వింటాల వరకు గింజ కాయ వస్తుంది. చెట్టు నుంచి కాయ తెంపేందుకు (మగవాళ్లకు) సుమారు రూ. 1200, కింద పడ్డ గింజ వేరు చేయడానికి (ఆడవారికి) రూ. 400 కూలీ చెల్లిస్తారు. ఇంటికి తీసుకువచ్చి గింజను వేరు చేయడానికి గంపకు రూ. 250 కూలీగా చెల్లిస్తారు. మొత్తంగా క్వింటా చింతపండు మార్కెట్‌కు తరలించే వరకు రూ. 8 వేల నుంచి రూ. 11 వేల వరకు ఖర్చు (రైతుకు ఇచ్చే డబ్బు కలిపి) అవుతుంది. ప్రస్తుతం సరుకును హైదరాబాద్ మార్కెట్‌కు తీసుకువస్తుండగా, క్వింటా కేవలం రూ. 6 వేల నుంచి రూ. 10 వేల వరకు మాత్రమే ధర పలుకుతుండటంతో చెట్లు గుత్తకు తీసుకున్న వ్యాపారులు దిగాలు చెందుతున్నారు.

గతేడాది లాభం చూసి..

గతేడాది చింత పండుకు మార్కెట్‌లో మంచి ధర పలికింది. క్వింటా రూ. 21 వేల నుంచి రూ. 22 వేల వరకు ధర పలకడంతో ఈసారి పోటీ పడి మరీ చెట్లను గుత్తకు తీసుకున్నారు. గతేడాది లాభం రావడంతో ఈసారీ నాలుగు పైసలు మిగులుతాయని భావించిన వారికి మార్కెట్‌లో ధరలు చేదు అనుభవాన్ని మిగులుస్తున్నాయి. గతేడాది చింతపండుకు గిరాకీ ఉండగా, అప్పట్లో కొనుగోలు చేసిన బడా వ్యాపారులు చింతపండును కోల్డ్ స్టోరేజీలో నిలువ ఉంచారు. అప్పటి నిల్వలు ఎక్కువగా ఉండటంతో ఈసారి కొత్త చింతపండుకు ధర పెట్టేందుకు వ్యాపారులు పెద్దగా ఆసక్తి చూపకపోవడంతో ధరపై ప్రభావం పడినట్లు భావిస్తున్నారు. మార్కెట్‌లో ధర లేకపోవడంతో కొందరు వ్యాపారులు చెట్ల మీదే కాయలు వదిలేస్తున్నారు. దీంతో చాలా చోట్ల చింతపండు చెట్టుమీదనుంచే రాలి, పాడవుతుంది. ఇక కొందరు రైతుల నుంచి చింత చెట్లను గుత్తకు తీసుకుని కాయ అమ్మిన తర్వాత డబ్బులు చెల్లిస్తామని ఒప్పందం చేసుకుంటారు. ఈమేరకు కొంత బయానా చెల్లిస్తారు. అయితే, ధర లేకపోవడం, చెట్లమీదనే కాయలు వదిలేయడంతో పాటు చాలా మంది బయానా వదిలేసుకుని వెళ్తుండటంతో రైతులూ నష్టపోతున్నారు.



చింతపండు నుంచి గింజను వేరు చేస్తున్న వృద్ధురాలు

కేసీఆర్ సమర శంఖం

- నేడు సుల్తాన్‌పూర్‌లో బీఆర్‌ఎస్ ప్రజా ఆశీర్వాద సభ
- బహిరంగ సభకు ఏర్పాట్లు పూర్తి
- సాయంత్రం 5.30 గంటలకు గులాబీ బాస్ ప్రసంగం
- ఆరు అసెంబ్లీ సెగ్మెంట్ల నుంచి జనసమీకరణ
- లక్షన్నర మందిని తరలించేందుకు సన్నాహాలు
- ఏర్పాట్లను పరిశీలించిన బీఆర్‌ఎస్ నేతలు



పుల్‌కల్, ఏప్రిల్ 15 : ఉమ్మడి మెదక్ జిల్లా పరిధిలోని జహీరాబాద్, మెదక్ లోక్‌సభ నియోజకవర్గాలకు బీఆర్‌ఎస్ అభ్యర్థులను ప్రకటించిన నాటి నుంచి గులాబీ నేతలు ప్రచార పర్వంలోకి దూకారు. అసెంబ్లీ సెగ్మెంట్లు, మండలాల వారీగా కార్యకర్తల సన్నాహక సమావేశాలను నిర్వహిస్తూ సమాయత్తమవుతున్నారు. ఇక మరో రెండు రోజుల్లో నామినేషన్ల ఘట్టం ప్రారంభమవుతుండగా మంగళవారం బీఆర్‌ఎస్ భారీ బహిరంగ సభను తలపెట్టింది. సంగారెడ్డి జిల్లా చౌటకూర్ మండలం సుల్తాన్‌పూర్ గ్రామ శివారు సింగూరు చౌరస్తా వద్ద నిర్వహించనున్న ప్రజా ఆశీర్వాద సభకు ఏర్పాట్లు పూర్తిచేశారు. గులాబీ బాస్ కేసీఆర్ ఈ వేదిక నుంచి ఎన్నికల ప్రచారానికి సమర శంఖం పూరించనున్నారు. సాయంత్రం 5.30 గంటలకు కేసీఆర్ ప్రసంగించనున్నారు. మూడు రోజుల క్రితం చేవెళ్లలో బీఆర్‌ఎస్ ప్రజా ఆశీర్వాద సభను నిర్వహించగా, సుల్తాన్‌పూర్ సభ రెండోవది.

ఆరు అసెంబ్లీ సెగ్మెంట్లకు కేంద్రం..

ఆరు అసెంబ్లీ సెగ్మెంట్లకు కేంద్రంగా ఉంటుందన్న ఉద్దేశంతో అందోలు అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలోని సుల్తాన్‌పూర్ వద్ద సభ నిర్వహణకు స్థలాన్ని ఎంపిక చేశారు. ఇందుకోసం స్థానిక రైతులకు చెందిన 45 ఎకరాల పట్టా భూమిని గుర్తించారు. బహిరంగ సభ వేదిక, కళాకారుల వేదిక, జనం కూర్చునేందుకు వీలుగా గ్యాలరీల ఏర్పాటు, వాహనాల పార్కింగ్‌కు అవసరమైన స్థలాన్ని చదును చేసి పనులను వేగంగా పూర్తి చేశారు. లోక్‌సభ ఎన్నికల సభ కావడంతో సంబంధిత రైతుల వద్ద నుంచి నిరభ్యంతర పత్రం (ఎన్‌వోసీ)లపై సంతకాలు తీసుకున్నారు. జహీరాబాద్, మెదక్ లోక్‌సభ పరిధిలోకి వచ్చే నారాయణఖేడ్, అందోలు, జహీరాబాద్, సంగారెడ్డి, పటాన్‌చెరు, నర్సాపూర్ అసెంబ్లీ నియోజకవర్గాల నుంచి జనసమీకరణ చేపట్టారు. మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు పర్యవేక్షణలో అన్ని ఏర్పాట్లు చేశారు. ప్రజా ఆశీర్వాద సభ ద్వారా అధికార కాంగ్రెస్, బీజేపీ పార్టీలను ఎదుర్కోవాలన్న కృతనిశ్చయంతో ఉన్న హరీశ్‌రావు భారీగా జన సమీకరణ చేయాలన్న పట్టుదలతో వారం రోజులుగా జహీరాబాద్ లోక్‌సభ అభ్యర్థి గాలి అనిల్‌కుమార్, మెదక్ లోక్‌సభ అభ్యర్థి బి.వెంకట్రామారెడ్డిను వెంటబెట్టుకుని ఆరు అసెంబ్లీ నియోజకవర్గాల్లో పర్యటిస్తూ పార్టీ నాయకులు, కార్యకర్తలతో సన్నాహక సమావేశాలు నిర్వహించారు. దాదాపుగా లక్షన్నర జనాన్ని తరలించడమే లక్ష్యంగా పెట్టుకున్నారు. సభ ద్వారా పార్టీ శ్రేణుల్లో ఉత్సాహం నింపి, ప్రత్యర్థి పార్టీలకు దీటైన సమాధానం చెప్పాలన్న పట్టుదలతో బీఆర్‌ఎస్ అధినాయకత్వం పనిచేస్తున్నది. జడ్పీ ఛైర్‌పర్సన్ పట్లోళ్ల మంజుశ్రీజైపాల్‌రెడ్డి, సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్, అందోలు మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్ ఎప్పటికప్పుడూ సభా వేదిక ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు.

విజయవంతం చేద్దాం

బీఆర్‌ఎస్ ప్రజా ఆశీర్వాద బహిరంగ సభను విజయవంతం చేయాలని జడ్పీ ఛైర్ పర్సన్ పట్లోళ్ల మంజుశ్రీజైపాల్‌రెడ్డి, సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్, అందోలు మాజీ ఎమ్మెల్యే క్రాంతికిరణ్ పిలుపునిచ్చారు. సోమవారం వారు సుల్తాన్‌పూర్ వద్ద సభ ఏర్పాట్లను పరిశీలించారు. అనంతరం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ భారీ జన సమీకరణతో ప్రతిపక్షాలకు దిమ్మదిరిగేలా సక్సెస్ చేయాలని కోరారు. రాష్ట్రంలో కేసీఆర్ తొమ్మిదిన్నరేళ్ల పాలన, కాంగ్రెస్ నాలుగు నెలల పాలన బేరీజు వేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు.

బీఆర్‌ఎస్ కౌన్సిలర్ ఇంటికి రఘునందన్‌రావు



గజ్వేల్, ఏప్రిల్ 15: గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మునిసిపాలిటీ పరిధిలోని 15వ వార్డుకు చెందిన బీఆర్‌ఎస్ పార్టీ కౌన్సిలర్ ఉప్పల మెట్టయ్య ఇంటికి బీజేపీ ఎంపీ అభ్యర్థి మాధవనేని రఘునందన్‌రావు వెళ్లారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా గజ్వేల్ పట్టణంలో రోడ్‌షోకు వచ్చిన ఆయన అకస్మాత్తుగా బీఆర్‌ఎస్ కౌన్సిలర్ ఇంట్లో ప్రత్యక్షమవడంతో పాటు అక్కడ ఉన్న ఆర్యవైశ్యులతో ముచ్చటించారు. ఈ సందర్భంగా ఆర్యవైశ్యుల మద్దతును ఆయన కోరారు. ఈ విషయమై కౌన్సిలర్ ఉప్పల మెట్టయ్యను వివరాలు అడగగా తన ఇంటికి రఘునందన్‌రావు అకస్మాత్తుగా వచ్చారని, ఇంటికి వచ్చిన వారితో మాట్లాడడం సాంప్రదాయం అయినందునే కాసేపు ముచ్చటించినట్లు తెలిపారు. కాగా ఆర్యవైశ్య సంఘానికి చెందిన ప్రముఖులు ఆ సమయంలో కౌన్సిలర్ మెట్టయ్య ఇంట్లో ఉండడంతో అనేక అనుమానాలు తలెత్తుతున్నాయి. ఇదే ఇంట్లో ఇటీవల మాజీ మంత్రి హరీశ్‌రావు విలేకరుల సమావేశం నిర్వహించడం గమనార్హం.

కౌంట్‌డౌన్

- 18న పార్లమెంట్ ఎన్నికల నోటిఫికేషన్
- ఆ రోజు నుంచే నామినేషన్ల స్వీకరణ
- 29 వరకు కొనసాగనున్న ప్రక్రియ

ఆంధ్రజ్యోతి ప్రతినిధి, సంగారెడ్డి, ఏప్రిల్ 15 : పార్లమెంట్ ఎన్నికలకు కౌంట్‌డౌన్ మొదలు కానున్నది. కేంద్ర ఎన్నికల సంఘం గత నెల 16న లోక్‌సభ ఎన్నికల షెడ్యూల్‌ను ప్రకటించగా ఆ రోజు నుంచి ఎలక్షన్ కోడ్ అమలులోకి వచ్చిన విషయం తెలిసిందే. మరో రెండు రోజుల్లో విడుదల చేయనున్న నోటిఫికేషన్‌తో ఎన్నికల్లో ప్రధాన ఘట్టమైన నామినేషన్ల ప్రక్రియ ప్రారంభమవుతుంది. దీంతో ప్రచార భేరి ఊపందుకోనున్నది.

రిటర్నింగ్ అధికారుల నుంచి నోటిఫికేషన్లు

18న ఉదయమే మెదక్ పార్లమెంట్ నియోజకవర్గానికి మెదక్ కలెక్టర్, రిటర్నింగ్ అధికారి రాహుల్‌రాజ్ నోటిఫికేషన్ జారీ చేస్తారు. అలాగే జహీరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గానికి సంగారెడ్డి కలెక్టర్, రిటర్నింగ్ అధికారి వల్లూరి క్రాంతి నోటిఫికేషన్ విడుదల చేస్తారు. ఆ వెంటనే నామినేషన్ల స్వీకరణ మొదలవుతుంది. 18వ తేదీ నుంచి 29వరకు నామినేషన్ల ప్రక్రియ కొనసాగనున్నది. 25న నామినేషన్ల స్వీకరణ ముగియనున్నది. 26న స్క్రూటినీ నిర్వహిస్తారు. ఈ నెల 29 వరకు నామినేషన్ల ఉపసంహరణకు చివరి గడువుగా ఎన్నికల సంఘం నిర్ణయించింది. మే 13న ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్ జరగనున్నది.

ఇక సమరమే..

మెదక్, జహీరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గాల నుంచి ప్రధాన పార్టీల అభ్యర్థిత్వాలు ముందుగానే ఖరారవడంతో వారు పార్టీ శ్రేణులతో సన్నాహక సమావేశాలను నిర్వహించి కదనోత్సాహాన్ని నింపారు. కాంగ్రెస్ తరఫున మెదక్ పార్లమెంట్ ఇన్‌చార్జి మంత్రి కొండా సురేఖ, జహీరాబాద్ పార్లమెంట్ ఇన్‌చార్జి మంత్రి దామోదర్ రాజనర్సింహ ఆయా నియోజకవర్గాల ఎమ్మెల్యేలు, ఇతర ముఖ్యులతో సమావేశమయ్యారు. అసెంబ్లీ సెగ్మెంట్ల వారీగా సమావేశాలు నిర్వహిస్తున్నారు. బీఆర్‌ఎస్ తరఫున రెండు పార్లమెంట్ నియోజకవర్గాల పరిధుల్లో మాజీ మంత్రి హరీశ్‌రావు అసెంబ్లీ సెగ్మెంట్లు, మండల స్థాయిలోనూ నాయకుల, కార్యకర్తల సమావేశాలు నిర్వహించి దిశానిర్దేశం చేశారు. రెండు నియోజకవర్గాలకు కలిపి మంగళవారం ప్రజా ఆశీర్వాద బహిరంగ సభను తలపెట్టింది. బీఆర్‌ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ పాల్గొని ప్రచార భేరిని ప్రారంభించనున్నారు. ఇక అందరి కంటే ముందే ఖరారైన బీజేపీ అభ్యర్థులు క్షేత్రస్థాయిలో కార్యకర్తలను సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగుతున్నారు. మెదక్ లోక్‌సభ అభ్యర్థి మాజీ ఎమ్మెల్యే ఎం.రఘునందన్‌రావు అయితే నియోజకవర్గమంతటా విస్తృతంగా పర్యటిస్తున్నారు. సిట్టింగ్ ఎంపీ, జహీరాబాద్ బీజేపీ అభ్యర్థి బీబీపాటిల్ అసెంబ్లీ సెగ్మెంట్‌లు, మండలస్థాయి సమావేశాలతో కార్యకర్తలు, నాయకులతో మమేకమవుతున్నారు. మొత్తానికి నోటిఫికేషన్‌కు ముందు అన్ని కసరత్తులు పూర్తిచేసుకుని, తమ అస్త్ర శస్త్రాలను సిద్ధం చేసుకున్న ప్రధాన పార్టీల అభ్యర్థులు నామినేషన్ల నాటి నుంచి ఎన్నికల కదనరంగంలో ప్రచారాన్ని హోరెత్తించనున్నారు.

భక్తిశ్రద్ధలతో రథ శిఖర స్థాపన

జోగిపేట, ఏప్రిల్ 15: ప్రఖ్యాతిగాంచిన జోగినాథస్వామి రథోత్సవానికిగానూ సోమవారం రథ శిఖర స్థాపన జరిపారు. ఈనెల 18న రథోత్సవం జరుగనున్న నేపథ్యంలో ఆలయ పూజరులు మందుప్పటి భద్రయ్యస్వామి, సుజీత్‌స్వామి రథోత్సవ కమిటీ చైర్మన్ శంకర్‌తో రథంపైన అమర్చే శిఖరాలు (ఇత్తడి గోళాలు)కు ప్రత్యేక పూజలు జరిపించారు. అనంతరం ఆ గోళాలను ఆనవాయితీ ప్రకారం తాపీమేస్త్రీలు భక్తిశ్రద్ధలతో తలపైనెత్తుకుని మేళతాళాల మధ్య రథం వద్దకు తోడుకుని వచ్చారు.

భారత్ గ్యాస్ ఏజెన్సీ రికార్డులు పరిశీలించిన డీసీఎస్‌వో

రాయపోల్, ఏప్రిల్ 15: రాయపోల్ భారత్ గ్యాస్ గోదాంలో డొమెస్టిక్ సిలిండర్ల నుంచి కమర్షియల్ సిలిండర్లలోకి గ్యాస్‌ను రీఫిల్ చేస్తుండగా పోలీసులు ఆదివారం రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్న విషయం తెలిసిందే. సోమవారం జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి తనూజ రాయపోల్ భారత్ గ్యాస్ గోదాం, కార్యాలయంలో తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించి మాట్లాడారు. రాయపోల్ భారత్ గ్యాస్ గోదాంలో నిబంధనలకు విరుద్ధంగా వంట గ్యాస్‌ను కమర్షియల్ సిలిండర్లలోకి రీఫిల్ చేసి హైదరాబాద్‌లోని వ్యాపార, వాణిజ్య సంస్థలకు విక్రయిస్తున్నారని ఫిర్యాదు రావడంతో తనిఖీ చేపట్టామని పేర్కొన్నారు. తనిఖీల్లో 11 నిండుగా ఉన్న కమర్షియల్ సిలిండర్లు, 64 సగం నింపిన కమర్షియల్ సిలిండర్లు లభించాయని వాటిని సీజ్ చేసినట్లు తెలిపారు. అలాగే 561 వంట గ్యాస్ సిలిండర్లను కూడా స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామని స్పష్టం చేశారు. ఈ విషయమై ఉన్నతాధికారుల సూచన మేరకు చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. అలాగే సంబంధిత గ్యాస్ కంపెనీ వారికి కూడా సమాచారం ఇస్తామని తెలిపారు. సిద్దిపేట జిల్లాలో ఎవరైనా గ్యాస్ అక్రమ రవాణాకు పాల్పడితే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆమె వెంట డీటీలు రాజిరెడ్డి, లావణ్య ఉన్నారు. ఇదిలా ఉండగా రాయపోల్ భారత్ గ్యాస్ గోదాంలో జరిగిన అక్రమాలకు సంబంధించి ఏజెన్సీ యజమానిని వివరణ కోరగా.. తనకు తెలియకుండానే సిబ్బంది ఇలా చేశారని చెప్పడంతో.. ఇద్దరు డెలివరీ బాయ్స్‌పై కేసు నమోదు చేశామని డీసీఎస్‌వో పేర్కొన్నారు. ఇంత పెద్ద కుంభకోణం ఏజెన్సీ యజమానికి తెలియకుండా జరగడం అసాధ్యమని వినియోగదారులు పేర్కొంటున్నారు.

ఆరోగ్య కార్యక్రమాల్లో సిబ్బంది తప్పనిసరిగా పాల్గొనాలి

● సిద్దిపేట జిల్లా డీఎంఅండ్‌హెచ్‌వో పుట్ల శ్రీనివాస్



సమావేశంలో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో శ్రీనివాస్

సిద్దిపేట టౌన్, ఏప్రిల్ 15: ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నిర్వహించే అన్ని ఆరోగ్య కార్యక్రమాలలో, ప్రతి బుధవారం వ్యాధి నిరోధర టీకాల కార్యక్రమంలో తప్పనిసరిగా వైద్యులు, సిబ్బంది పాల్గొనాలని సిద్దిపేట డీఎంఅండ్‌హెచ్‌వో పుట్ల శ్రీనివాస్ సూచించారు. సోమవారం సిద్దిపేట పట్టణంలోని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో సీనియర్ నర్సింగ్ అధికారులు, స్టాఫ్‌నర్సులతో కలిసి సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గర్భిణుల పరీక్షలు మొదలు, సుఖ ప్రసవం జరిగేలా అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రసవాలు నిర్వహించాలని తెలిపారు. మాతృ, శిశు మరణాలు సంభవించకుండా చూడాలని, ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వచ్చిన ప్రజలను ఆప్యాయంగా ఆహ్వానించాలన్నారు. వారికి కావలసిన ఆరోగ్య సేవలను సమయం లోపల అందించాలని, గర్భిణుల దగ్గరి నుంచి ప్రసవాల సంఖ్యకు సంబంధించిన రికార్డులను ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేసుకోవాలని సూచించారు. ఎంసీహెచ్ పోర్టల్ ఎంట్రీలను ఎప్పటికప్పుడు చూసుకోవాలని, ఆరోగ్య కేంద్రానికి వచ్చిన వారికి, క్షయవ్యాధి, డయాబెటిస్, హైపర్ టెన్షన్, బీపీ, అసంక్రమిత వ్యాధుల స్క్రీనింగ్, ఆరోగ్య పరీక్షలు, ఫాలో కేసులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. వైద్యులు, అధికారులు, సిబ్బంది సమయపాలన పాటించాలని, సమయపాలన పాటించని వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ సమావేశంలో డిప్యూటీ డీఎంహెచ్‌వోలు, డాక్టర్ వినోద్ బాబ్జి, డాక్టర్ శ్రీనివాస్, ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ విజయరాణి, డాక్టర్ రజిని, డాక్టర్ శ్రీదేవి, శ్రీనివాస్‌రెడ్డి, ఏవో, డీపీహెచ్ఎన్‌వోఎస్ మేరీ, డెమో నవీన్, రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రధాన పార్టీలకు దీటుగా పోటీ ఇస్తా..

● జహీరాబాద్ పార్లమెంట్ బరిలో ఎన్ఆర్ఐ గుర్రపు మచ్చేందర్


సిర్గాపూర్ మండంలంలోని బొక్కస్‌గామ్‌లో ప్రచారం చేస్తున్న మచ్చేందర్

కల్హేర్, ఏప్రిల్ 15: జహీరాబాద్ పార్లమెంట్ పరిధిలో స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేయనున్న తాను ప్రధాన పార్టీలకు దీటుగా పోటీ ఇవ్వనున్నట్లు కల్హేర్ మండలంలోని మార్డి గ్రామానికి చెందిన ఎన్ఆర్ఐ గుర్రపు మచ్చేందర్ తెలిపారు. ఈ మేరకు సోమవారం ప్రచారాన్ని ప్రారంభించిన ఆయన కల్హేర్ మండలంలోని ఫత్తేపూర్, బీబీపేట్, సిర్గాపూర్ మండలంలోని పోచాపూర్, గోసాయిపల్లి, బొక్కస్‌గామ్ తదితర గ్రామాల్లో ప్రజలను కలిసి ఓట్లను అభ్యర్థించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తాను ప్రజల సమస్యలను వెలుగులోకి తీసుకువచ్చి పరిష్కరించేందుకు ఎంపీగా పోటీ చేస్తున్నానని, దీనివల్ల తనకు గుర్తింపు లభించడంతో పాటు ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను దగ్గరగా చూసే అవకాశముంటుందన్నారు. 10 ఏళ్లుగా బీబీ పాటిల్, ఐదేళ్లుగా సురేష్‌షెట్కార్ ఎంపీగా ఉండి ఈ ప్రాంతానికి ఏమి చేశారని ఓట్లు అడుగుతున్నారని ప్రశ్నించారు. స్వతంత్ర అభ్యర్థిగా పోటీచేస్తున్న తనను జహీరాబాద్ ప్రజలు ఆశీర్వదించాలని కోరారు. నాయకులు శ్రీనివాస్, అభిపవార్, ప్రభుపటేల్, మల్లేష్, రవి పాల్గొన్నారు.


ఒగ్గుడోలు శిక్షణను పొందుతున్న ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు


శ్రీకృష్ణ అవతారం విన్యాసంలో విద్యార్థులు

డిల్లెం.. బల్లెం..

● ఒగ్గుడోలుకు గత వైభవం
● సిద్దిపేట ప్రభుత్వ కళాశాలలో ప్రత్యేక శిక్షణా తరగతులు పూర్తి
● అబ్బాయిలతో పాటు అమ్మాయిలకు సైతం..
● ఉత్సాహంగా పాల్గొన్న విద్యార్థులు


శివముద్ర విన్యాసంలో విద్యార్థులు

సిద్దిపేట క్రైం, ఏప్రిల్ 15: సిద్దిపేట జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఒగ్గు నృత్యానికి గత వైభవాన్ని తీసుకొచ్చే ప్రయత్నం చేశారు. తెలుగు విభాగం ఆధ్వర్యంలో చుక్క సత్తయ్య మనుమడు ఒగ్గు రవి ఆధ్వర్యంలో ఈ నెల 4 నుంచి ఒగ్గుడోలు శిక్షణను 15 వరకు కొనసాగింది. ప్రతిరోజు 5 గంటల వరకు శిక్షణను అందించారు. ఈ శిక్షణకు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఉన్న ఎన్‌సీసీ విద్యార్థులు ఎక్కువ ఆసక్తి కనబరిచారు. తెలంగాణ ప్రధాన జానపద వృత్తి కళారూపం ఒగ్గుడోలు నృత్యం. గొల్ల కురుమల ఆరాధ్య దైవమైన మల్లన్నను కొలిచేందుకు ఉద్దేశించిన ఒగ్గుడోలు కాలక్రమేణా భక్తికి వినోదాన్ని జోడించి వేదికలకు ఎక్కించారు. తాత, ముత్తాతల నుంచి అందించబడుతున్న ఈ ఒగ్గుడోలు నృత్యం నిత్య ప్రక్రియగా మారింది. ఒగ్గుడోలు నృత్యంలో చాలామంది పెద్దలు కష్టపడినప్పటికీ డాక్టర్ చుక్క సత్తయ్య, మిద్దె రాములు కృషి మరువలేనిది. వీరిద్దరూ ఒగ్గుడోలు నృత్యానికి సూర్యచంద్రులాంటి వారిని అందరూ అంటుంటారు. డాక్టర్ చుక్క సత్తయ్య మనవడు డాక్టర్ ఒగ్గు రవి అబ్బాయిలతో పాటు అమ్మాయిలకు కూడా ఈ ఒగ్గుడోలు శిక్షణను అందించాడు.


నరసింహ అవతారం విన్యాసం నేర్చుకుంటున్న విద్యార్థులు

21 రోజులు పాటు శిక్షణ

గతకాలంలో ఒగ్గుడోలు నిపుణులు 41 రోజుల్లో ఉదయం 11 నుంచి సాయంత్రం 5 గంటలలోపు శిక్షణ పూర్తి చేసేవారు. ప్రస్తుతం ఒగ్గు రవి ఆధ్వర్యంలో 21 రోజులపాటు ఉదయం నుంచి సాయంత్రం వరకు శిక్షణను అందించారు. ఉదయం పూట రెక్కలగూడెం, శివయ్య ముద్ర, శ్రీకృష్ణ అవతారం, నరసింహావతారం, శిశువుల కరణం, శ్రీశైల పర్వతం, రత్నం ఒకటి, రెండు, దుమ్మి దొమ్మరి గడ్డ, నీలువు దొమ్మరి గడ్డ, కోడెల స్తంభం విన్యాసాలు నేర్పించారు. అడుగులు, దరువులలో ఆదిసరుపు, బిళ్లం, జోగు, కడెం, ముందడుగు, జాడియా లక్ష్మి లాంటివి 12 విన్యాసాలు శిక్షణలో నేర్పించారు. మధ్యాహం నుంచి సాయంత్రం వరకు తరగతి గదుల్లో మానవతా విలువలు, క్రమశిక్షణ, తల్లి దండ్రులపై ప్రేమ, రామాయణం, మహాభారతం నీతి, నియమాలు, భారతీయ సంస్కృతిపై ప్రేమ లాంటివి విద్యార్థులకు శిక్షణ అందించారు.

ఒగ్గుడోలు నృత్యాన్ని భవిష్యత్ తరాలకు అందిస్తాం

ఒగ్గుడోలు నృత్యాన్ని కొన్నేళ్లుగా తెలంగాణలో కాకుండా ప్రపంచవ్యాప్తంగా పరిచయం చేయాలని ప్రయత్నం చేస్తున్నాను. ఒగ్గుడోలు నృత్యాన్ని పరిచయం చేసిన వ్యక్తి మా తాత చుక్క సత్తయ్య, అతని మనువడిగా ఈ నృత్యాన్ని వందల మందికి శిక్షణ ఇవ్వాలని నేను నిర్ణయించుకున్నాను. చుక్క సత్తయ్య, మిద్దె రాములు ఇద్దరూ ఒగ్గు నృత్యానికి సూర్యచంద్రుడులు లాంటివారు. ఈ క్రమంలో మా తాత చెప్పిన ప్రకారం నేను శిక్షణ పూర్తి చేసుకుని తెలంగాణకే పరిమితమైన ఈ ఒగ్గుడోలు నృత్యాన్ని ప్రపంచవ్యాప్తంగా పరిచయం చేయాలనే ఉద్దేశంతో శిక్షణ ప్రారంభించాను. ఇప్పటికీ తెలంగాణలో 51 కేంద్రాల్లో ఒగ్గుడోలు శిక్షణ అందించాం. ఇతర రాష్ట్రాల్లో కూడా కలెక్టర్ ట్రైనింగ్‌లో ఒగ్గుడోలు శిక్షణను అందించాను.



- ఒగ్గుడోలు రవి, ప్రధాన శిక్షకుడు

ఒగ్గు శిక్షణ చాలా బాగుంది



సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఒగ్గుడోలు శిక్షణ చాలా బాగుంది. అంతరించిపోతున్న కళ నేర్చుకోవడం నేను అదృష్టంగా భావిస్తున్నాను. ఒగ్గుడోలు అంటే ఎవరికీ తెలియదు. అలాంటిది నేర్చుకోవడం చాలా సంతోషం. ఇక్కడ శిక్షణ పూర్తి చేసుకున్న అనంతరం ఉస్మానియా యూనివర్సిటీలో శిక్షణకు హాజరవుతాం. మా శిక్షకుడు ఒగ్గు రవి చాలా అద్భుతంగా శిక్షణ ఇస్తున్నాడు.

- నరేందర్, పెద్ద చెప్యాల, బీకాం కంప్యూటర్స్ ఫస్ట్ ఇయర్

ఒగ్గుడోలు శిక్షణ తీసుకోవడం మా అదృష్టం



ఒగ్గుడోలు జానపద నృత్యం తెలంగాణకు పరిమితం కాకుండా జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ఎదగడానికి కృషిచేస్తాం. ఒగ్గుడోలు అంతరించిపోకుండా సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శిక్షణ ఇస్తున్నారు. ఇంత మంచి శిక్షణ తీసుకోవడం అదృష్టంగా భావిస్తున్నా.

- వంశీ, దానంపల్లి, బీజెడ్‌సీ ఫస్ట్ ఇయర్

ముగిసిన శిక్షణ

రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల తెలుగు విభాగం ఆధ్వర్యంలో, చండీశ్వర ఒగ్గు కళాసేవా సమితి మాణిక్యపురం వారు సంయుక్తంగా పదిరోజులుగా నిర్వహిస్తున్న ఒగ్గుడోలు శిక్షణ కార్యక్రమం సోమవారం తెలుగు శాఖా అధ్యక్షుడు ఎస్.మహేందర్ అధ్యక్షతన ముగిసింది. ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఒగ్గు బీర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఒగ్గు ధర్మయ్య మాట్లాడుతూ.. చుక్కా రవి ఇప్పటివరకు వివిధ శిబిరాలలో అబ్బాయిలకు మాత్రమే ఒగ్గు డోలును నేర్పించారు. కానీ మొదటి సారిగా కళాశాల స్థాయిలో అబ్బాయిలతో పాటు అమ్మాయిలకు ఒగ్గు డోలు నేర్పించడం గొప్పగా ఉన్నదన్నారు.

సంగారెడ్డి జిల్లా ట్రైనింగ్ కలెక్టర్‌గా మనోజ్


కలెక్టర్ క్రాంతికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న ట్రైనింగ్ కలెక్టర్ మనోజ్

సంగారెడ్డి అర్బన్, ఏప్రిల్ 15: తెలంగాణకు కేటాయించిన 2023 ఐఏఎస్ బ్యాచ్‌కు చెందిన మనోజ్ సంగారెడ్డి కలెక్టరేట్‌లో సోమవారం ట్రైనింగ్ కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించారు. అనంతరం కలెక్టర్ వల్లూరు క్రాంతికి పుష్పగుచ్ఛం అందజేసి మర్యాదపూర్వకంగా కలిశారు.

దేశంలో నియంతృత్వ పాలన

● రాజకీయాల్లోకి గుండాలు.. హంతకులు
● ఫోన్ ట్యాపింగ్ దుర్మార్గపు చర్య.. బాధ్యులెవరైనా శిక్షార్హులే
● సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకటరెడ్డి


సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి

హుస్నాబాద్ రూరల్, ఏప్రిల్ 15: దేశంలో నియంతృత్వ పాలన సాగుతోందని, వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో ప్రతిఒక్కరూ ఆలోచనతో ప్రజాస్వామ్య విలువల పరిరక్షణ కోసం పని చేసే పార్టీలను ఎన్నుకోవాలని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి పేర్కొన్నారు. సోమవారం హుస్నాబాద్ పట్టణంలోని అనభేరి, సింగిరెడ్డి అమరుల భవనంలో చాడ విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గుండాలు, హంతకులు, నేరచరిత్ర కలిగిన వారు, వ్యాపారులు, ధనవంతులు ఎంపీ, ఎమ్మెల్యే ఎన్నికల్లో పోటీ చేయడంతో రాజకీయాలకు విలువలేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. పదేళ్ల బీజేపీ పాలనలో మోదీ ఇచ్చిన హామీల్లో కనీసం ఒక్క హామీ కూడా నెరవేర్చలేదన్నారు. జన్‌ధన్ ఖాతాల వల్ల ఒక్క పేదవాడికైనా మేలు జరిగిందా అని ప్రశ్నించారు. దేశంలో మతోన్మాదాన్ని పెంచిపోషించినంతగా, పేదల సమస్యలు తీర్చలేని బీజేపీని, ఈ ఎన్నికల్లో గద్దెదించాల్సిన అవసరం ఏర్పడిందన్నారు. వామపక్షాలను అంతం చేయాలన్న ఏ ప్రభుత్వం కూడా మనుగడ సాధించలేకపోయాయన్నారు. ఇందుకు మునుగోడు ఎన్నికల్లో బీఆర్ఎస్ గెలుపు కోసం కృషిచేసిన వామపక్షాలను కేసీఆర్ తొక్కిపడేయాలన్న అహంకారాన్ని తదుపరి జరిగిన ఎన్నికల్లో ప్రజలు తగిన గుణపాఠం చెప్పారన్నారు. ప్రస్తుతం కేసీఆర్ ఏ పరిస్థితుల్లో ఉన్నాడో ఆయా పార్టీలు గుర్తుపెట్టుకోవాలని హితవు పలికారు. తెలంగాణలో కాంగ్రెస్ వందరోజుల పరిపాలన ప్రజా ఆకాంక్షల వైపు పయనిస్తోందని, ఇదే పాలన చివరి వరకు ఇచ్చిన వాగ్దానాలు పరిపూర్ణం చేసేందుకు పనిచేస్తుందని ఆశిస్తున్నామన్నారు. సీపీఐ పార్లమెంట్ ఎన్నికల్లో ఇండియా కూటమితో కలిసి పనిచేస్తుందన్నారు. తెలంగాణలో 5 పార్లమెంట్ సీట్లు ఇవ్వాలని కోరామని, కనీసం ఒక్క సీటైనా ఇవ్వాలన్న డిమాండ్‌తో కాంగ్రెస్ అధిష్ఠానంతో చర్చిస్తున్నామన్నారు. ఈ సమావేశంలో సీపీఐ మండల కార్యదర్శి గడిపె మల్లేశం, ఎడల వనేష్, సంజీవరెడ్డి, మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పింఛన్ రూ.4వేలు ఇవ్వని రేవంత్... రూ.4 లక్షల జీతం తీసుకుంటుండు

● నాలుగు నెలల్లో ప్రజలకు శఠగోపం పెట్టాడు
● 400 సీట్లలో మెదక్ పార్లమెంట్ సీటు ఉండాలి
● బీజేపీ మెదక్ ఎంపీ అభ్యర్థి ఎం.రఘునందన్‌రావు


గజ్వేల్‌లో నిర్వహించిన రోడ్‌షోలో రఘునందన్‌రావు

గజ్వేల్, ఏప్రిల్ 15: డిసెంబరు 9 నుంచి అవ్వ, తాతలకు రూ.4వేల పింఛన్ ఇస్తానని చెప్పిన రేవంత్ ప్రజలకు శఠగోపం పెట్టారని, ఆయన మాత్రం రూ.4 లక్షల జీతాన్ని తీసుకుంటున్నారని బీజేపీ మెదక్ ఎంపీ అభ్యర్థి ఎం.రఘునందన్‌రావు ఆరోపించారు. సిద్దిపేట జిల్లా గజ్వేల్ పట్టణంలో ఆయన సోమవారం రోడ్‌షోను నిర్వహించి మాట్లాడారు. ఎన్నో హామీలు ఇచ్చిన రేవంత్‌రెడ్డి నాలుగు నెలల్లో ప్రజలకు నీళ్లు, కరెంట్, పింఛన్ ఇవ్వడం లేదని, డిసెంబరు 9న రూ.2 లక్షలు మాఫీ చేస్తానని చెప్పిన రేవంత్‌రెడ్డి ఢిల్లీకి తిరుగుతున్నాడు కానీ, రుణమాఫీ చేయడం లేదన్నారు. కేసీఆర్‌ను ఇంటికి పంపాలన్న ఉద్దేశంతోనే ప్రజలు రేవంత్‌రెడ్డికి ఓటు వేశారని, ఇక ఆయనను ప్రజలు నమ్మే పరిస్థితి లేదన్నారు. గజ్వేల్ ఎమ్మెల్యేగా గెలిచిన కేసీఆర్ ఏనాడైనా గజ్వేల్ ప్రజలకు కలిశారా అని ప్రశ్నించారు. గజ్వేల్ పట్టణంలో నిరుపేదలకు ఇస్తానన్న డబుల్ బెడ్‌రూం ఇళ్లను ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించారు. గతంలో కలెక్టర్‌గా పనిచేసిన వ్యక్తి ఇంట్లో 30 బెడ్‌రూం ఇళ్లు ఉన్నాయని చెబుతున్నారని, కానీ ఇక్కడ గరీబోళ్లకు మాత్రం ఇవ్వలేదన్నారు. 400 సీట్లతో మూడోసారి మోదీ ప్రధాని కానున్నాడని, 400 సీట్లలో మెదక్ ఉండాలని కోరారు. సీనియర్ నాయకులు జశ్వంత్‌రెడ్డి, టేకులపల్లి రాంరెడ్డి, సింగం సత్తయ్య, నందన్‌గౌడ్, ఎల్కంటి సురేశ్, కమ్మరి శ్రీనివాస్, మహేశ్, నేమూరి ఆంజనేయులుగౌడ్, నత్తి శివకుమార్ ఉన్నారు.

వెంకట్రామారెడ్డిపై కేసెందుకు పెట్టలేదు..

తూప్రాన్, ఏప్రిల్ 15: అసెంబ్లీ ఎన్నికల సమయంలో డబ్బులు రవాణా చేసిన బీఆర్ఎస్ ఎమ్మెల్సీ మెదక్ అభ్యర్థి వెంకట్రామారెడ్డిపై ఎందుకు కేసు పెట్టడం లేదని, అరెస్టు చేయడం లేదని బీజేపీ మెదక్ పార్లమెంట్ అభ్యర్థి మాధవనేని రఘునందన్‌రావు ప్రశ్నించారు. తూప్రాన్ పట్టణంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎన్నికల సమయంలో పోలీసు వాహనాల్లో డబ్బులు తీసుకెళ్లినట్లు తాను ఆరోపించడం లేదని, రాధాకిషన్‌రావే చెప్పారని పేర్కొన్నారు. మంత్రి పొంగులేటి వియ్యంకుడు కావడం వల్ల.. దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి పైరవీతో వెంకట్రామారెడ్డిని కాపాడుతున్నారా అని ప్రశ్నించారు.

ప్రమాదవశాత్తు పగిలిన బస్సు టైర్

● తప్పిన ప్రమాదం.. ఊపిరిపీల్చుకున్న ప్రయాణికులు

మునిపల్లి, ఏప్రిల్ 15: జహీరాబాద్ డిపోకు చెందిన ఆర్టీసీ (పల్లె వెలుగు) బస్సు సంగారెడ్డి నుంచి జహీరాబాద్ వెళ్తుండగా మార్గమధ్యంలో ప్రమాదవశాత్తు టైర్ పగిలింది. దీంతో అప్రమత్తమైన డ్రైవర్ రోడ్డు పక్కకు ఆపి ప్రయాణికులను కిందకు దింపాడు. ఈ ఘటన మునిపల్లి మండలం (ముంబాయి జాతీయ రహదారి) బుదేరా చౌరస్తా సమీపంలో గల మహిళా డిగ్రీ కళాశాల ఎదుట సోమవారం జరిగింది. ఈ ఘటనతో బస్సులోని ప్రయాణికులు ఆందోళనకు గురయ్యారు. ఎవరికీ ఎలాంటి ప్రమాదం జరగకపోవడంతో అందరూ ఊపిరిపీల్చుకున్నారు. అనంతరం కొందరు ప్రయాణికులు ఆటోలో వెళ్లగా.. మరికొందరిని కండక్టర్ ఎక్స్‌ప్రెస్ బస్సు ఆపి పంపించారు.

డబ్బే..డబ్బు..

● మాజీ ఎమ్మెల్యే కారులో రూ.1.80 లక్షలు
● ఆర్టీసీ బస్సులో మరో రూ.లక్ష


పోచమ్మరాల్ చెక్‌పోస్టు వద్ద మాజీ ఎమ్మెల్యే కారులో నగదు స్వాధీనం చేసుకున్న ఎస్ఐ ఆనంద్‌గౌడ్

హవేళిఘణపూర్/పెద్దశంకరంపేట/తూప్రాన్, ఏప్రిల్ 15: మెదక్ జిల్లాలో ఎన్నికల నేపథ్యంలో పోలీసులు చేపట్టిన తనిఖీల్లో డబ్బు పట్టుపడుతోంది. హవేళిఘణపూర్ మండలంలోని పోచమ్మరాల్ చెక్‌పోస్టు వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా.. ఎల్లారెడ్డి మాజీ ఎమ్మెల్యే వాహనంలో రూ.1.80 లక్షలు పట్టుబడ్డాయి. ఆ డబ్బులకు ఎలాంటి ఆధారాలు లేకపోవడంతో సీజ్ చేసినట్లు ఎస్ఐ ఆనంద్‌గౌడ్ తెలిపారు. కారులో ప్రయాణిస్తున్న నితిన్‌రెడ్డి, మనోజ్‌లను అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. అలాగే, 161వ జాతీయ రహదారిపై పెద్దశంకరంపేట మండల పరిధిలోని కోలపల్లి చెక్‌పోస్టు వద్ద సోమవారం మహారాష్ట్రలోని దెగ్లూర్ నుంచి హైదరాబాద్ వెళ్తున్న వాహనంలో రూ.లక్ష నగదును ఎస్ఐ పట్టుకున్నారు. ఇక తూప్రాన్ పట్టణ శివారులోని నాగులపల్లి చౌరస్తా వద్ద సోమవారం రాత్రి ఆర్టీసీ బస్సులో నిర్వహించిన తనిఖీలో రూ.లక్ష పట్టుకున్నట్లు తూప్రాన్ ఎస్ఐ శివానందం తెలిపారు. కామారెడ్డి నుంచి సికింద్రాబాద్ వెళ్తున్న ఆర్టీసీ ఎక్స్‌ప్రెస్ బస్సును తనిఖీ చేశారు. కామారెడ్డి నుంచి ఉప్పల్ వెళ్తున్న ఉప్పల్‌కు చెందిన ఎలుక శ్యామల వద్ద రూ.లక్ష లభించినట్లు వివరించారు. నగదుకు సంబంధించి ఎలాంటి ఆధారాలు లభించకపోవడంతో సీజ్ చేసినట్లు తూప్రాన్ ఎస్ఐ శివానందం తెలిపారు.

ఏపీవోను బర్తరఫ్ చేయాలి

● కలెక్టర్‌కు వినతిపత్రం అందజేసిన కాంగ్రెస్ నాయకులు



సిద్దిపేట కలెక్టర్ మనుచౌదరికి వినతిపత్రం అందజేస్తున్న కాంగ్రెస్ నాయకులు

సిద్దిపేట టౌన్, ఏప్రిల్;15: తప్పుడు పత్రాలతో సిద్దిపేట కలెక్టర్ కార్యాలయంలో ఉద్యోగంలో చేరినట్లు ఆరోపిస్తూ, ఏపీవో నర్సింగరావుపై వెంటనే కేసు నమోదు చేసి విధుల నుంచి బర్తరఫ్ చేయాలని కాంగ్రెస్ సిద్దిపేట పట్టణ అధ్యక్షుడు అత్తుఇమామ్ డిమాండ్ చేశారు. ఇటీవల సిద్దిపేటలో బీఆర్ఎస్ అభ్యర్థి పి. వెంకట్రామారెడ్డి ఉద్యోగులతో సమావేశం కాగా, 106 మంది ఉద్యోగులను గుర్తించి సస్పెన్షన్ చేశారని, వారితో పాటు ఇంకా కొంతమంది ఉద్యోగులు తప్పించుకున్నారని సిద్దిపేట కలెక్టర్ మనుచౌదరికి ఆయన వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా అత్తుఇమామ్ మాట్లాడుతూ.. సమావేశంలో పాల్గొన్న ఉద్యోగులను గుర్తించేందుకు సీసీ కెమెరాల రికార్డుల పరిశీలనలో ఏపీవో నర్సింగరావు పదిమంది ఉద్యోగుల నుంచి పెద్ద మొత్తంలో డబ్బులు తీసుకొని, వారు సస్పెండ్ కాకుండా అడ్డుపడ్డారని ఆరోపించారు. కార్యక్రమంలో నాయకులు గ్యాదరి మధు, గాయసుద్దీన్, రాషద్, నజ్జు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వం హామీలను నిలబెట్టుకోవాలి

● సీఎంకు ఉత్తరాలు రాసిన రైతులు



చిన్నకోడూరులో ఉత్తరాలను చూపుతున్న జడ్పీ చైర్‌పర్సన్ రోజాశర్మ, రైతులు



సిద్దన్నపేట మార్కెట్ యార్డులో ఉత్తరాలను చూపుతున్ననాయకులు, రైతులు

చిన్నకోడూరు, ఏప్రిల్ 15: రైతులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని జడ్పీ చైర్‌పర్సన్ రోజాశర్మ డిమాండ్ చేశారు. అసెంబ్లీ ఎన్నికల్లో రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని సోమవారం చిన్నకోడూరు మార్కెట్ యార్డులో రైతులు సీఎం రేవంత్‌రెడ్డికి ఉత్తరాలు రాశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. బూటకపు మాటలతో గద్దెనెక్కిన కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీలను విస్మరించిందన్నారు. జరగబోయే పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు రైతులు తగిన గుణపాఠం చెబుతారన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ మాణిక్యరెడ్డి, బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి రాధాకృష్ణశర్మ, మండలాధ్యక్షుడు శ్రీనివాస్, వైస్ ఎంపీపీ పాపయ్య, పీఏసీఎస్ చైర్మన్ కనకరాజు, ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ రవీందర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ ఉమేష్ చంద్ర తదితరులు పాల్గొన్నారు. మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్‌లు రాగుల సారయ్య, ఎల్ల సోమిరెడ్డి, ఎంపీటీసీలు బెదురు తిరుపతి, శనిగరం బాబు, రైతుబంధు సమితి మండల మాజీ అధ్యక్షుడు బద్దిపడగ కిష్టారెడ్డి, సొసైటి చైర్మన్ కోల రమేష్‌గౌడ్, బీఆర్ఎస్ నాయకులు మల్లయ్య, వెంకట్‌రెడ్డి, వేణు, పరుశురాములుగౌడ్, భాస్కర్‌రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

సిద్దిపేటలో..

సిద్దిపేటరూరల్, ఏప్రిల్ 15: కల్లబొల్లి మాటలు చెప్పి రైతులను మోసం చేస్తూ కాలం వెళ్లదీస్తున్న కాంగ్రెస్‌కు రైతులే బుద్ధి చెబుతారని సిద్దిపేట రూరల్ మండలం మాజీ ఎంపీపీ, బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులడు ఎర్ర యాదయ్య విమర్శించారు. సోమవారం మండలంలోని రాఘవాపూర్ గ్రామంలో సీఎం రేవంత్‌రెడ్డికి రైతులు ఉత్తరాలు రాసే కార్యక్రమంలో మాట్లాడారు. ఇచ్చిన హామీలను అమలు చేయకుండా రైతులను నట్టేట ముంచుతున్న సీఎం రేవంత్‌రెడ్డికి రైతులు ఉత్తరాల ద్వారా బాధలను పంపించారని చెప్పారు. వరి ధాన్యానికి బోనస్‌గా ఇవ్వాల్సిన రూ.500, రైతు భరోసా రూ.15000, రైతుకూలీలకు రూ.12000, రైతు రుణమాఫీ రూ.2 లక్షలు, పంట నష్టపరిహారం రూ.25000 వేల చొప్పున త్వరగా రైతులకు అందించాలని డిమాండ్ చేశారు. రంగనాయక సాగర్‌లో నీటిని నింపి కాలువల ద్వారా చెరువులలో నీటిని తరలించాలని, దాంతో భూగర్భ జలాలు పెరిగి బావుల్లో నీటి శాతం పెరుగుతుందని, పంటలు ఎండిపోతుంటే ప్రభుత్వం, అధికారులు పట్టించుకోవడంలేదని ఉత్తరంలో పేర్కొన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

నంగనూరులో..

నంగునూరు, ఏప్రిల్ 15 : రైతులకు ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలని మాజీ ఎంపీపీ జాప శ్రీకాంత్‌రెడ్డి, బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు ఆనగోని లింగం గౌడ్ డిమాండ్ చేశారు. సోమవారం మండలంలోని సిద్దన్నపేట మార్కెట్ యార్డులో సీఎం రేవంత్‌రెడ్డి రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని పోస్టు కార్డు ద్వారా వినూత్న నిరసన చేశారు. కార్యక్రమంలో

చెట్టును ఢీకొట్టిన కారు.. కానిస్టేబుల్‌కు గాయాలు



ప్రమాదంలో ధ్వంసమైన కారు

చేర్యాల, ఏప్రిల్ 15: మండలంలోని ముస్త్యాల గ్రామ శివారులో ఓ కారు చెట్టును ఢీకొట్టింది. ఈ సంఘటనలో పోలీస్ కానిస్టేబుల్ కరుణాకర్‌కు తృటిలో ప్రాణాపాయం తప్పింది. కుటుంబసభ్యులను సోమవారం తెల్లవారుజామున జనగామ రైల్వేస్టేషన్‌కు తీసుకువెళ్లి కారులో తన కూతురుతో ఇంటికి తిరుగుముఖం పట్టాడు. ముస్త్యాల గ్రామశివారులో కారు అదుపుతప్పి రోడ్డుపక్కను ఉన్న చెట్టును ఢీకొట్టింది. దీంతో కారు ముందుభాగం ధ్వంసమైంది. కారులో ఉన్న కరుణాకర్, అతడి కూతురికి క్షేమంగా బయటపడ్డారు.

ఇసుక అక్రమ రవాణా చేస్తున్న లారీల పట్టివేత



ఇసుక లారీతో టాస్క్‌ఫోర్స్, గజ్వేల్ పోలీసులు

గజ్వేల్, ఏప్రిల్ 15: అక్రమంగా ఇసుకను రవాణా చేస్తున్న లారీలను సిద్దిపేట టాస్క్‌ఫోర్స్ పోలీసులు, గజ్వేల్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఐదు లారీల్లో ఏలాంటి వేబిల్ లేకుండా ఇసుకను హైదరాబాద్‌కు తరలిస్తున్నారన్న సమాచారంతో, టాస్క్‌ఫోర్స్ పోలీసులు, గజ్వేల్ పోలీసులు గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మునిసిపాలిటీ పరిధిలోని రాజీవ్ రహదారి పై ఓవర్ బ్రిడ్జి వద్ద దాడులు నిర్వహించి ఐదు లారీలను స్వాధీనం చేసుకున్నారు. ఈ విషయమై గజ్వేల్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

బీఆర్ఎస్ నాయకులను విమర్శించే స్థాయి లేదు



సిద్దిపేటలోని హరీశ్‌రావు నివాసంలో మాట్లాడుతున్న మహిళ విభాగం నాయకులు

సిద్దిపేట టౌన్/దుబ్బాక ఏప్రిల్ 15: జిల్లాకు చెందిన ఓ మంత్రి కార్యక్రమంలో తనకు కుర్చీ ఇవ్వలేదని మీడియా ముందు ఏడ్చిన కాంగ్రెస్ సిద్దిపేట జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలు ముద్దం లక్ష్మీకి, బీఆర్ఎస్ నాయకురాలు కత్తి కార్తీక, ఎమ్మెల్యే హరీశ్‌రావును విమర్శించే స్థాయి లేదని బీఆర్ఎస్ సిద్దిపేట మహిళ విభాగం నాయకులు మండిపడ్డారు. సోమవారం సిద్దిపేట పట్టణంలోని ఎమ్మెల్యే హరీశ్‌రావు నివాసంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మహిళ విభాగం నాయకురాలు మాట్లాడుతూ.. ఒక మహిళ అయి ఉండి సాటి మహిళను వ్యక్తిగతంగా విమర్శించడం, మేకప్ గురించి మాట్లాడడం ముద్దం లక్ష్మి మూర్ఖత్వమని మండిపడ్డారు. ఆదివారం దుబ్బాకలో జరిగిన ఓ సమావేశంలో ముద్దం లక్ష్మి చేసిన అనుచిత వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ మహిళా విభాగం నాయకురాల్లు నరసమ్మ, సువర్ణలక్ష్మి, సునీత, నాగవ్వ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ రాష్ట్ర నాయకురాలు కత్తి కార్తీకగౌడ్‌పై కాంగ్రెస్ మహిళ నాయకురాలు నోరు అదుపులో పెట్టుకుని మాట్లాడితేనే మంచిదని దుబ్బాక మున్సిపల్ చైర్‌పర్సన్ గన్నె వనితాభూంరెడ్డి, కౌన్సిలర్ పల్లె మీనలు మండిపడ్డారు. సోమవారం దుబ్బాకలో బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో వారు మాట్లాడారు. కార్యక్రమంలో గౌడసంఘం నాయకులు అబ్బుల రాజలింగం, రామస్వామిగౌడ్, కౌన్సిలర్లు యాదగిరి, స్వామి,మల్లేశంగౌడ్, వీనా తదితరులున్నారు.

అడుగంటుతున్న భూగర్భ జలాలు

● ఆదుకోవాలని రైతుల వేడుకోలు

నంగునూరు, ఏప్రిల్ 15: ఎండల తీవ్రత పెరగడంతో భూగర్భ జలాలు రోజురోజుకూ తగ్గిపోతున్నాయి. పంటలు చేతికొచ్చే దశలో ఎండిపోతున్నాయి. పంటలు ఎండిపోతుంటే రైతులు కన్నీరు పెడుతున్నారు. మండలంలోని సిద్దన్నపేట, నర్మెట్ట, పాలమాకుల, నంగునూరు, బద్దిపడగ, నాగరాజుపల్లి, పాలమాకుల, అక్కెనపల్లి, గ్రామాల్లో భూగర్భ జలాలు అడుగటడడంతో బోరు బావులపై ఆధారపడి సాగు చేసిన పంటలకు నీరు అందకపోవడంతో పంటలు ఎండిపోతున్నాయి. దాంతో చేసేదేమీ లేక ఎండిపోయిన వరిని పశువులను తోలి మేపుతున్నారు. గత వర్షాకాల ప్రారంభంలో చెరువులు, వాగులు, చెక్ డ్యాములో నిండిన నీటిని చూసి యాసంగిలో రైతులు వరి సాగు చేశారు. పరిస్థితులు మారిపోవడంతో సాగు చేసిన పంటలను కాపాడుకోవడం కోసం రైతులు అష్టకష్టాలు పడుతున్నారు. కొంతమంది రైతులు పంటను కాపాడుకోవడం కోసం 300 నుంచి నలుగు వందల అడుగుల బోర్లు వేసి నిరుత్సాహానికి గురవుతున్నారు. చివరి దశకు వచ్చిన పంటను కాపాడుకునేందుకు వర్షం కోసం ఆకాశం పైపు దీనంగా ఎదురుచూస్తున్నారు.



సిద్దన్నపేటలో పశువులను మేపుతున్న దృశ్యం

నీళ్లు లేక పంట ఎండిపోయింది



సిద్దన్నపేటలో గత వర్షాకాలంలో పుష్కలంగా నీరు రావడంతో ఎకరన్నర పొలంలో వరి సాగు చేశాను. తీరా పంట చేతికి వచ్చే సమయంలో బోరు ఎండిపోయింది. చేసేదేమీ లేక పొలంలోకి పశువులను తోలి మేపుతున్నాను. ప్రభుత్వం నన్ను ఆదుకోవాలి.

- మహిళా రైతు దేవులపల్లి ఎల్లవ్వ, సిద్దన్నపేట

మామిడాలలో ఘనంగా బీరప్ప ఉత్సవాలు



బీరప్ప ఉత్సవాల్లో పాల్గొన్న ఎమ్మెల్సీ యాదవరెడ్డి, ప్రతాప్‌రెడ్డి

ములుగు, ఏప్రిల్ 15: చండీశ్వర బీరప్ప ఆశీస్సులు ప్రజలందరీపై ఉండాలని ఎమ్మెల్సీ యాదవరెడ్డి, ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డిలు కోరారు. సోమవారం మండల పరిధిలోని మామిడాల ఆర్‌అండ్‌ఆర్ కాలనీలో చండీశ్వర బీరప్ప ఆలయ ప్రారంభోత్సవం, కల్యాణ మహోత్సవానికి వారితో పాటు బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు జహంగీర్, జడ్పీటీసీ జయమ్మ అర్జున్‌గౌడ్ హాజరై ప్రత్యేక పూజలు చేశారు. వారివెంట ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ కోడూరు భూపాల్‌రెడ్డి, మాజీ సర్పంచ్ సత్తయ్యచారి, వీరేశంగౌడ్, అనిల్, ఆరె సత్తయ్య యాదగిరి, జనార్దన్, నర్సింహులు, సాయిలు, కిష్టయ్య ఉన్నారు. అనంతరం అతిథులను ఆలయ నిర్వాహకులు సన్మానించారు.

దళితవాడ నుంచి పశువుల సంతను తొలగించాలి

దుబ్బాక, ఏప్రిల్15: దళితవాడ నుంచి పశువుల సంతను తొలగించాలని దుబ్బాక పీఏసీఎస్ వైస్ చైర్మన్ కాల్వనరేష్ డిమాండ్ చేశారు. సోమవారం దుబ్బాక తహసీల్దార్‌కు కాంగ్రెస్ నాయకులతో కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పద్మయ్య, శ్రీనివాస్, చంద్రారెడ్డి,మల్లేశం, శ్రీకాంత్, గోపి, జీవన్‌రెడ్డి తదితరులున్నారు

బీఎస్పీ సిద్దిపేట జిల్లా అధ్యక్షుడిగా ఓం ప్రకాశ్

గజ్వేల్, ఏప్రిల్ 15: బీఎస్పీ సిద్దిపేట జిల్లా అధ్యక్షుడిగా కటికల ఓం ప్రకాశ్‌ను నియమిస్తూ బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు మంద ప్రభాకర్ ఉత్తర్వులను వెలువరించారు. హైదరాబాద్‌లో జరిగిన రాష్ట్ర కమిటీ సమావేశంలో రాష్ట్ర కార్యదర్శులు జక్కుల వెంకట్, లింగంపల్లి యాదగిరిలతో కలసి నూతన అధ్యక్షుడిని ప్రకటించారు.

మృతుడి కుటుంబానికి ఆర్థిక సహాయం

దూళిమిట్ట, ఏప్రిల్ 15: మండలంలోని దుబ్బాతండా గ్రామపరిధిలోని చెలిమితండాలో కాంగ్రెస్ కార్యకర్త జాటోత్ శ్రీరామ్ మృతి చెందిన విషయం తెలుసుకున్న డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి ఆదేశానుసారం, దూళిమిట కాంగ్రెస్ నాయకులు మృతదేహనికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించి ఐదు వేల ఆర్థిక సహాయాన్ని అందచేశారు

అగ్ని ప్రమాదాల పట్ల అప్రమత్తంగా ఉండాలి



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న అగ్నిమాపక కేంద్ర అధికారులు,సిబ్బంది

సిద్దిపేట క్రైం, ఏప్రిల్ 15: వేసవిలో అగ్ని ప్రమాదాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సిద్దిపేట అగ్నిమాపక కేంద్రం ఇన్‌చార్జి అధికారి నరేష్ సూచించారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా సోమవారం సిద్దిపేటలోని ఆర్టీసీ డిపో, ఆర్టీసీ బస్టాండ్ వద్ద ప్రజలకి అగ్నిప్రమాదల అప్రమత్తతపై సిబ్బందితో కలసి అవగాహన కల్పించారు. అగ్నిప్రమాదం జరిగినప్పుడు ఫైర్ స్టేషన్ నెంబర్ 8712699250, 8712699251కి లేదా 101 ఫోన్ చేసి సమాచారం ఇవ్వలాన్నారు. అనంతరం అగ్నిమాపక వారోత్సవాల వాల్ పోస్టరలను ఆవిష్కరించారు.

ధాన్యం కొనుగోళ్లు వెంటనే చేపట్టాలి

చేర్యాల, ఏప్రిల్ 15: దాన్యం కొనుగోళ్లు వెంటనే చేపట్టాలని సీపీఎం చేర్యాల మండల కార్యదర్శి కొంగరి వెంకట్‌మావో డిమాండ్ చేశారు. మండలంలోని ఆకునూరు గ్రామంలోని ధాన్యం కొనుగోలుకేంద్రాన్ని సోమవారం ఆయన సందర్శించి రైతులతో మాట్లాడారు. రెండు వారాల క్రితం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన అధికారులు కాంటా ప్రారంభించకపోవడం తగదన్నారు. పట్టణంలోని వ్యవసాయమార్కెట్ యార్డులో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సీపీఐ నాయకుడు కత్తుల భాస్కర్‌రెడ్డి సందర్శించారు. ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడం తగదని మండిపడ్డారు.

మెదక్ పార్లమెంట్ ఓబీసీ ఇన్‌చార్జిగా సూర్యవర్మ నియామకం

సిద్దిపేట టౌన్, ఏప్రిల్ 15: మెదక్ పార్లమెంట్ ఓబీసీ సెల్ ఇన్‌చార్జిగా, ఓబీసీ సెల్ సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు సూర్యవర్మను టీపీసీసీ ఓబీసీ సెల్ చైర్మన్, తెలంగాణ బీసీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ నూతి శ్రీకాంత్‌గౌడ్ నియమించారు. ఈ సందర్భంగా సూర్యవర్మ మాట్లాడుతూ.. మెదక్ పార్లమెంట్‌లో కాంగ్రెస్ జెండా ఎగురవేయడానికి ఓబీసీ సెల్ పార్లమెంట్ ఇన్‌చార్జిగా అన్ని నియోజకవర్గంలో పర్యటిస్తానని చెప్పారు.

'బీజేపీ అభ్యర్థిని గెలిపించండి'

ములుగు, ఏప్రిల్ 15: బీజేపీ మెదక్ పార్లమెంట్ అభ్యర్థి రఘునందన్‌రావును గెలిపించాలని బీజేపీ జిల్లా నాయకుడు చింతల అరుణ్‌కుమార్‌రెడ్డి కోరారు. ఆయన సోమవారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. పది సంవత్సరాలుగా కేంద్ర ప్రభుత్వం విడుదల చేస్తున్న నిధులతోనే గ్రామపంచాయతీలు అభివృద్ధి చెందాయని, పేదల సంక్షేమం కోసం నిధులు ఇచ్చిన ఘనత కేంద్ర ప్రభుత్వానిదేనన్నారు.

వడదెబ్బ పట్ల ప్రజలకు అవగాహన కల్పించాలి

● జిల్లా వైద్యాధికారి పుట్ల శ్రీనివాస్



మిరుదొడ్డిలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న జిల్లా వైద్యాధికారి

మిరుదొడ్డి/కుకునూరుపల్లి ఏప్రిల్ 15: వడదెబ్బ పట్ల ప్రజలకు అవగాహన కల్పించాలని జిల్లా వైద్యాధికారి పుట్ల శ్రీనివాస్ సూచించారు. సోమవారం మిరుదొడ్డిలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. పలు రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలకు వడదెబ్బ పట్ల అవగాహన పెంచాలన్నారు. గ్రామాల్లోని ప్రజలకు ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తల ద్వారా అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. ఆస్పత్రుల్లో రోగులకు అన్ని రకాల మందులు అందుబాటులో ఉంచాలన్నారు. మొదటిసారి పీహెచ్‌సీకి వచ్చిన ఆయన్ని ఆస్పత్రి వైద్యాధికారి సమీనా సుల్తానా, సీహెచ్‌ఓ లింగమూర్తిలు వైద్యసిబ్బందితో కలిసి సన్మానించారు. ఆయన వెంట జిల్లా ఉపవైద్యాధికారులు వినోద్ బాబీ, శ్రీనివాస్, సిబ్బంది రాజేశ్వర్, నసీమా, భాస్కర్, రవీందర్, రాజశేఖర్, స్వప్న, నరేష్ తదితరులున్నారు. కుకునూరుపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా వైద్యాధికారి పీ. శ్రీనివాస్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని రికార్డులను పరిశీలించారు. ఐపీ, ఓపీ సేవల వివరాలను అడిగి తెలుసుకున్నారు. కచ్చితంగా అన్ని రకాల మందుల వివరాలను స్టాక్ రికార్డులో పొందుపరచాలన్నారు. ఆయన వెంట డిప్యూటీ డీఎంహెచ్‌వో శ్రీనివాస్, రవీందర్‌రెడ్డి ఉన్నారు.

బీఆర్ఎస్ కార్యకర్తల అసంతృప్తి

రాయపోల్, ఏప్రిల్ 15: పార్టీలో ఏళ్ల తరబడి పనిచేస్తున్నా తమకు గుర్తింపు దక్కడంలేదని రాయపోల్ మండల బీఆర్ఎస్ నాయకులు కొందరు ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం వారు మాట్లాడుతూ.. పార్టీలో కష్టపడి పనిచేస్తున్నా వారికి గుర్తింపు ఇవ్వడం లేదని, ఎన్నికలప్పుడు మాత్రమే మండల పార్టీ సభ్యులు తమను వాడుకుంటున్నారని ఆరోపించారు. ఈ విషయాన్ని ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి, మాజీ మంత్రి సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు దృష్టికి తీసుకెళ్తామన్నారు.

సంక్షేమ పథకాలను వివరించాలి

● ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర కార్యదర్శి రాచకొండ ప్రశాంత్

కొండపాక, ఏప్రిల్ 15: ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలని ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర కార్యదర్శి రాచకొండ ప్రశాంత్ సూచించారు. కొండపాకలో సోమవారం ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి నీలం మధు గెలుపు కోసం ప్రతీ కార్యకర్త కృషి చేయాలన్నారు. సమావేశంలో ఎస్సీ సెల్ అధ్యక్షుడు విజయ్ కుమార్, ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు వడ్లకొండ రవీందర్, పలువురు కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

సిద్దిపేట రూరల్, ఏప్రిల్ 15: పట్టణంలోని కాళ్లకుంట కాలని, సమీప కాలనీలలో మంగళవారం ఉదయం 8 గంటల నుంచి ఉదయం 10గంటల వరకు విద్యుత్ సరాఫర నిలిపివేస్తున్నట్లు విద్యుత్ శాఖ సిద్దిపేట పట్టణ ఏడీ సుధాకర్‌రెడ్డి తెలిపారు. చెట్ల కొమ్మల తొలగింపులో భాగంగా విద్యుత్ సరాఫర నిలిపివేస్తున్నట్టు చెప్పారు.

పూజల హరికృష్ణ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన నాయకులు

నారాయణరావుపేట, ఏప్రిల్ 15: మండల కేంద్రానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు సోమవారం సిద్దిపేట కాంగ్రెస్ క్యాంపు కార్యాలయంలో ఆ పార్టీ సిద్దిపేట నియోజకవర్గ ఇన్‌చార్జి పూజల హరికృష్ణ సమక్షంలో కాంగ్రెస్ చేరారు. వారికి పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బర్మా రామచంద్రం, ఫిషర్మేన్ రాష్ట్ర కార్యదర్శి గౌటి బాబేష్, యూత్ కాంగ్రెస్ జిల్లా ప్రధానకార్యదర్శి చింతల రాజ్‌వీర్, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.

పూజల హరికృష్ణ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన వాళ్లు బీఆర్ఎస్ వారు కాదని ఆ పార్టీ మండల అధ్యక్షుడు కోనయ్యగారి ఏల్లయ్య ఒక ప్రకటనలో ఖండించారు. కాంగ్రెస్ కార్యకర్తలకే కండువా కప్పి బీఆర్ఎస్ నాయకులు కాంగ్రెస్ చేరినట్లు ప్రకటించుకోవడం సరికదన్నారు.

ఆలయ నిర్మాణానికి రూ. 50 వేల విరాళం

నంగునూరు, ఏప్రిల్ 15: మండలంలోని జేపీ తండాలో నిర్మిస్తున్న దుర్గా వీరాంజనేయ స్వామి ఆలయానికి రంగధాంపల్లికి చెందిన ప్రముఖ వ్యాపారవేత్త వంగ రాజేశ్వర్‌రెడ్డి రూ.50 వేల విరాళం సోమవారం ఆలయ కమిటీ సభ్యులకు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆలయ నిర్మాణానికి తన వంతుగా సహాయాన్ని అందించడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో జేపీ తండా తాజా మాజీ సర్పంచ్ భూక్యా భిక్షపతి నాయక్, సీనియర్ నాయకులు భూక్యా లక్ష్మణ్ నాయక్, కులం పెద్దమనిషి వీరా నాయక్, గౌరబోయిన రాజు మాలోత్, రమేశ్ మాలోత్ పాల్గొన్నారు.

ఎన్నికలను సమర్థవంతంగా నిర్వహించాలి

● జనగామ ఆర్డీవో కొమురయ్య

చేర్యాల, ఏప్రిల్ 15: జనగామ నియోజకవర్గంలో ఎన్నికలను సమర్థవంతంగా నిర్వహించేందుకు అధికారులు, సిబ్బంది చిత్తశుద్ధితో పాటుపడాలని జనగామ ఆర్డీవో కొమురయ్య సూచించారు. పట్టణంలోని రైతువేదికలో సోమవారం చేర్యాల, కొమురవెల్లి, మద్దూరు, దూళిమిట్ట మండలాల తహసీల్దార్లు, అధికారులు, బీఎల్‌వోలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఎన్నికల నిర్వహణ పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించకూడదన్నారు. వృద్ధులు, దివ్యాంగులు ఇంటివద్దే ఓటుహక్కు వినియోగించుకునేలా చర్యలుతీసుకోవాలని తెలిపారు.

'పార్లమెంట్ ఎన్నికల్లో సీపీఎంకు పట్టం కట్టాలి'

చేర్యాల, ఏప్రిల్ 15: ఆచరణ సాధ్యంకాని హామీలనిచ్చి ప్రజలను వంచించి బీజేపీ, కాంగ్రెస్, బీఆర్ఎస్ ప్రభుత్వాలను నడిపాయని, పార్లమెంటు ఎన్నికలలో ఆయా పార్టీలను ఓడించి సీపీఎంకు పట్టం కడితేనే ప్రజాసమస్యలు పరిష్కారమవుతాయని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు కాముని గోపాలస్వామి అన్నారు. కొమురవెల్లి మండలం మర్రిముస్త్యాల గ్రామంలో సోమవారం నిర్వహించిన పార్టీ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. మూడు పార్టీల నాయకులు లక్షల కోట్ల ప్రజాధనాన్ని కొల్లగొట్టి కోట్లకు పడగలెత్తారని ఆరోపించారు. సమావేశంలో నాయకులు శెట్టిపల్లి సత్తిరెడ్డి, రాళ్లబండి శశిధర్, బద్దిపడిగ కృష్ణారెడ్డి, నక్కల యాదవరెడ్డి, అత్తిని శారద తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్, బీఆర్ఎస్‌లను చిత్తుగా ఓడించాలి

● బీజేపీ మండల అధ్యక్షుడు చిక్కుడు చంద్రం

తొగుట, ఏప్రిల్, 15: కాంగ్రెస్, బీఆర్ఎస్‌ల అభ్యర్థులను వచ్చేఎన్నికల్లో చిత్తుగా ఓడించాలని బీజేపీ మండల అధ్యక్షుడు చిక్కుడు చంద్రం ముదిరాజ్ పిలుపునిచ్చారు. సోమవారం రిటైర్డ్ ఆర్మీ జవాన్ నీల చంద్రంతో కలిసి మండలంలోని ఎల్లారెడ్డిపేట, తుక్కాపూర్, తొగుట గ్రామాల్లోని ఆర్మీజవాన్‌ల ఇళ్లకు వెళ్లి రఘునందన్‌రావు తరపున ఎన్నికల ప్రచారం నిర్వహించారు. సైనికుల త్యాగాలతోనే దేశం సుభిక్షంగా ఉందని, దేశ రక్షణ కోసం మరోమారు బీజేపీకే పట్టం కట్టాలని పిలుపునిచ్చారు. అంతకు ముందు ఆయా గ్రామల్లో ఆర్మీజవాన్‌ల తల్లితండ్రులను శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు మహేష్, నరేశ్, సాయిగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

భద్రాచలంలో గోటి తలంబ్రాల అప్పగింత



ఈవో రమాదేవికి తలంబ్రాలను అప్పగిస్తున్న రామరాజు

గజ్వేల్/గజ్వేల్‌టౌన్, ఏప్రిల్ 15: భద్రాచల రాముల వారి కల్యాణానికి గజ్వేల్ రామకోటి భక్త సమాజం ఆధ్వర్యంలో తయారు చేసిన 150 కిలోల గోటి తలంబ్రాలను భద్రాచల ఆలయ ఈవో రమాదేవీ, ఏఈవో శ్రావణ్‌కుమార్‌లకు రామకోటి సమాజం అధ్యక్షుడు రామరాజు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కృషి, పట్టుదల ఉంటే ఏదైనా సాధించవచ్చన్నారు. రామకోటికి తాము అప్పగించిన 150 కిలోల వడ్లను రామనామ స్మరణ చేయించి, లక్షల మంది భక్తుల చేత గోటితో వడ్లను ఒలిపించి సేకరించడం గొప్ప విషయమన్నారు. ఆయనను శాలువాతో సత్కరించారు. గోటి తలంబ్రాల ద్వారా భక్తులు సమర్పించిన హుండీని ఆలయ ఈవో ఎల్.రమాదేవీ దేవస్థానంలోనే రామకోటి రామరాజుకు అందజేశారు.



ధాన్యాన్ని ఆరబోసుకోవడానికి కల్లాలు లేక పోవడం, గ్రామాల్లో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల వద్ద సరిపడా స్థలం లేని కారణంగా, మండలంలోని పలు గ్రామాల్లో రైతులు ధాన్యం ఆరబోయడానికి రోడ్లను ఆశ్రయిస్తున్నారు. దీంతో రోడ్లపై ప్రయాణం చేయాలంటేనే వాహనదారులు హడలిపోతున్నారు. రాత్రి వేళల్లో ధాన్యం కుప్పలు కారణంగా ప్రమాదాలు జరిగే అవకాశం లేకపోలేదని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

- చిన్నకోడూరు

సీతారాముల కల్యాణానికి ఆలయాల ముస్తాబు



దౌల్తాబాద్ మండలంలోని ఇందుప్రియల్‌లో బ్రహ్మోత్సవాలకు ముస్తాబైన ఆలయం



మిరుదొడ్డిలో కల్యాణ మహోత్సవ కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు



కుకునూరుపల్లిలోని పురాతనమైన సీతారామాంజనేయ ఆలయంలో సీతారాములు

దౌల్తాబాద్, ఏప్రిల్ 15: ఈ నెల 17న జరిగే సీతారాముల కల్యాణానికి ఆలయాలను ముస్తాబు చేస్తున్నారు. మండలంలోని ఇందుప్రియల్ గ్రామంలో ప్రతీ సంవత్సరం జరిగే శ్రీసీతారామచంద్ర స్వామి వారి బ్రహ్మోత్సవాలు ఈ నెల 17 నుంచి ప్రారంభం కానున్నాయాని ఆలయ ధర్మకర్త అన్నారెడ్డి సుభాష్ రెడ్డి తెలిపారు. ఉత్సవాల్లో భాగంగా ఈనెల 17న సుప్రభాత సేవ, దివ్య ప్రబంధ పారాయణం, విశ్వక్సేన ఆరాధన, అఖండ దీపారాధన,అంకుర్పాణ తదితర కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు.

● **కుకునూరుపల్లి:** మండల కేంద్రంలోని పురాతనమైన శ్రీ సీతారామాంజనేయ ఆలయం బ్రహ్మోత్సవాలకు ముస్తాబైంది. సోమవారం విశ్వక్సేన ఆరాధన, పుణ్యావచన కార్యక్రమం ప్రారంభమైంది. మంగళవారం ధ్వజారోహణ, బుధవారం శ్రీ సీతారామ స్వామి కల్యాణోత్సవం, ఆదివారం మహా పూర్ణాహుతి, అభిషేకంతో బ్రహ్మోత్సవాలు ముగియనున్నాయి.

● **మిరుదొడి:** ఈనెల 17న మిరుదొడ్డిలోని శ్రీసీతారామచంద్రస్వామి దేవాలయంలో నిర్వహించే కల్యాణ మహోత్సవాన్ని విజయవంతం చేయాలని ఆలయ కమిటీ అధ్యక్షుడు నారాయణ కోరారు. సోమవారం మిరుదొడ్డిలో ఆయన కమిటీ సభ్యులతో కలిసి సీతారామచంద్రస్వామి కల్యాణ మహోత్సవ కరపత్రాలను విడుదల చేశారు.